# బంగారు మొలతాడు

(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక 19-8-1988)

---

'దేనికైనా సుడనేది వుండాలి గురూగారూ అది లేకపోతే ఏం చేసినా ఉపయోగం వుండదు' వేదాంతిలా చెప్పేడు శంకర్రావు.

'సుడీ కాదూ పాడూ కాదు. దీన్లో ఏదో రహస్యం వుండి తీరాలి' తన అభిప్రాయం వెలిబుచ్చాడు బుచ్చిరాజు.

'అబ్బాయ్ నేనొక మాట చెప్తాను వినండి. తెలివితేటలనేది వుండాలిగాని డబ్బు సంపాదించడం అంత కష్టమైన పనేం కాదు' నిర్లక్ష్యంగా అన్నాడు చలపతి.

మీరు ఎన్నన్నా చెప్పండి మన కృష్ణమూర్తి మాత్రం చాలా అదృష్టవంతుడు. ఆ విషయాన్ని మీరు ఒప్పుకుని తీరాల్సిందే' శంకర్రావే అన్నాడు మళ్ళీ.

'ఒప్పుకోక చస్తామా కళ్ళారా చూస్తున్నాం కదా. లేకపోతే నిన్న మొన్నటివరకు ఎక్కడ ఏ ఉద్యోగం వస్తుందా అని ఎదురు చూస్తూ పైసా సంపాదన లేకుండా కూర్చున్న కృష్ణమూర్తి ఇంత కొద్ది కాలంలో వేలకు వేలు సంపాయించాడంటే అదృష్టవంతుడు కాక మరేమిటి' అన్నాడు చలపతి.

వెధవ మొలతాళ్ళ వ్యాపారం చేయడం ఏమిటి, ఇంత డబ్బు సంపాయించడం ఏమిటి ఇదేదో మిష్టరీనే. ఎలాగయినా సరే వాణ్ణి విసిగించి, వేపించయినా సరే వాడి విజయ రహస్యం తెలుసుకుని తీరాల్సిందే' మిత్రులంతా ఒక్కటే నిర్ణయానికి వచ్చేశారు

అసలు జరిగిన విషయం ఏమిటంటే ఇటీవల కృష్ణమూర్తి

మొలతాళ్ళ వ్యాపారం ప్రారంభించాడు. అదేం విచిత్రమో ఆ వ్యాపారం దినదిన ప్రవర్ధమానమై అతనికి పేరు, గుర్తింపే కాకుండా వేలకు వేలు డబ్బు కూడా ఆర్జించి పెట్టింది.

ఎక్కడ విన్నా మొలతాళ్ళ గురించే. ఎక్కడ చూసినా మొల తాళ్ల కోసే జనమే ప్రతి కొట్లోనూ జనం విరగబడి కొనుక్కుంటు న్నారు. కొన్నిచోట్ల క్యూలు పోలీసుల కంట్రోలు కూడా కంటపడినై.

బంగారు వన్నె మొలతాళ్ళు అందంగా పాలితిన్ పాకెట్లో అమ్మకాలు జరిగిపోతున్నై.

అనతికాలంలోనే వార్తాపత్రికల్లో కూడా స్థానం సంపాయించు కుంది మొలతాళ్ళ వ్యాపారం. మరికొద్ది రోజులకే రేడియో వ్యాపార ప్రకటనల్లో వినపడింది.

వీటన్నింటివి మించి పోస్టు ద్వారా మొలతాళ్ళను పంప మంటూ మనియార్డర్లతో కూడిన అభ్యర్థనలు రావడం కృష్ణమూర్తి వ్యాపారంలోని మరో విశేషం.

పల్లెలనుంచి కూడా జనం గుంపులు గుంపులుగా రావడం, మొలతాళ్ళు కొనుక్కుపోవడం మొదలుపెట్టారు.

ఎవరైనా గుడికి వెళ్లదలుచుకుంటే కొబ్బరికాయ, పూలు వగైరాలు కొన్నా కొనకపోయినా మూడు మూరలైనా మొలతాడు కొనుక్కుని గాని వెళ్ళడం లేదు,

ఏ డాక్టరు దగ్గరకు వెళ్ళినా తను వ్రాసే ప్రిస్క్రిప్షన్‌లో మందుగా మూడు మూరల మొలతాడు వ్రాసిగాని మిగిలిన మందులు వ్రాయడం లేదు.

అలా అలా కృష్ణమూర్తి వ్యాపారం మూడు మూరలు, ఆరు గజాలుగా సాగిపోతూ అతనికి వేలకు వేలు డబ్బు సమకూర్చి

పెట్టింది.

అతను ఆ వ్యాపారంతో అంత డబ్బు సంపాయించడం అనేకమందికి అనేక రకాల అనుమానాల్తోపాటు ఆశ్చర్యాన్ని, కొద్ది మందికి అసూయను కూడా కలిగించింది.

చివరికతని మిత్రులు ఆ కొంతమంది ఆ విజయ రహస్యం తెలుసుకోవాలని కృష్ణమూర్తి దగ్గరకు బయల్దేరారు తన వ్యాపారం ఇంతగా ప్రజాదరణ పొందటానికి, తను అంత డబ్బు సంపాయించ గలగడానికి ఓ రహస్యం వున్నమాట నిజమేనని ఒప్పుకన్నాడు కృష్ణమూర్తి.

"డియర్ ఫ్రెండ్స్ నా మొలతాళ్ళ వ్యాపారం ఇంతగా పాపు లర్ కావడానికి, నాకింతగా డబ్బు సంపాయించి పెట్టడానికి కారణం చాలా సింపుల్."

"ఇటీవల కాలంలో కొన్నిరోజులు పచ్చగాజులు వేసుకుంటే మంచిదంటూ ఆడవారంతా ఎగబడి కొనుక్కున్నారు."

"ఆ తర్వాత ఎర్రచీరెలు, ఎర్రజాకెట్లు అంటూ వేలం వెర్రిగా విరగబడి కొనుక్కున్నారు." ఈసారి వెరైటీగా మొగవారికూడా అలాంటి ప్రచారం ఒకటి మొదలుపెడితే ఎలా వుంటుంది అనే ఆలో చన వచ్చింది. వెంటనే అమలు పరిచాను. అంతే, నా ఊహ నిజం అయింది. నాలుగు డబ్బులు సంపాయించుకున్నాను." రహస్యం చెప్పేశాడు కృష్ణమూర్తి.

— o —